క్లుప్తంగా

మొక్కలతోనే మానవాళి మనుగడ



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ నరసింహపాత్రుడు దంపతులు

పెదగంట్యాడ: మానవాళి మనుగడకు మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు అన్నారు. వార్డు పరిధి అశోక్ నగర్‌లో వేంచేసియున్న నూకాంబిక అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటారు. కార్పొరేటర్ నరసింహపాత్రుడు మాట్లాడుతూ మండలంలో ఎక్కువగా పరిశ్రమలు ఉన్నాయని, కాలుష్యాన్ని నివారించేందుకు విరివిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బొడ్డు అనురాధ, బసా వెంకటస్వామి రెడ్డి, ఆచారి, ఆర్.శ్రీనివాస్, ఆనంద్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై ఆంక్షలు సరికాదు



శిబిరం వద్ద ప్రసంగిస్తున్న సత్యనారాయణ

పెదగంట్యాడ: ఆదానీ గంగవరం పోర్టు కార్మికులు 46 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమని సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ అన్నారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద చేపట్టిన నిరవధిక దీక్ష శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. కార్మికుల ఆందోళనకు మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కార్మికుల గురించి యాజమాన్యం ఆలోచించాలని కోరారు. కార్మికులను ఆదుకోవాల్సిన యాజమాన్యం ఆంక్షలు విధించడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఆనంద్, దుర్గారావు, పల్లేటి పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

కవలల వైద్యానికి 'ఏహెచ్‌వో' సహకారం



శంకరరావుకు నగదు అందిస్తున్న ఏహెచ్‌వో ఫౌండేషన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: నెలలు నిండకుండానే పుట్టిన కవలల వైద్యానికి ఆల్వేస్ హెల్ప్ ఫర్ అదర్స్ ఫౌండేషన్ (ఏహెచ్‌వో) ప్రతినిధులు సహకారం అందించారు. నగరానికి చెందిన జొన్నాడ శంకరరావు భార్య శ్యామల 6నెలల గర్భవతిగా ఉండగానే అధిక రక్తస్రావం జరగడంతో ఈ నెల 2వ తేదీన షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చేరారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమెకు ఆపరేషన్ చేయడంతో కవలలు జన్మించారు. నెలలు నిండకుండానే జన్మించడంతో వారిని ఎన్‌ఐసీయూలో ఉంచారు. కవలల శ్వాసకోశ వ్యవస్థ సరిగా లేకపోవడంతో చికిత్స కోసం లక్షల రూపాయలు ఖర్చవుతుందని వైద్యులు తెలపడంతో నిరుపేదలైన తల్లిదండ్రులు ఆర్థిక సహాయం కోసం విజ్ఞప్తి చేశారు. మానవతా దృక్పథంతో ముందుకు వచ్చిన ఏహెచ్‌వో ప్రతినిధులు వారికి రూ.11,300 అందించారు.

బీజేపీ రాష్ట్ర కోశాధికారిగా నాగేంద్ర

ఎంవీపీ కాలనీ: బీజేపీ రాష్ట్ర కోశాధికారిగా ఎం.నాగేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నియామక పత్రం జారీ చేసినట్టు ఆ పార్టీ విశాఖ కార్యాలయం వెల్లడించింది. ఈ సందర్భంగా నాగేంద్రకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

ఆతృతే మృత్యుహేతువై..

- హైవేపై ఉదయం, సాయంత్రం వేళల్లో విపరీతమైన రద్దీ
- సర్వీస్ రోడ్లు లేక అందరూ ఒకే మార్గంలో ప్రయాణం
- ఈ క్రమంలో భారీ వాహనాలు బైక్‌లకు తగిలి ప్రమాదాలు
- గత రెండు నెలల్లో 12 మంది దుర్మరణం



శనివాడ జంక్షన్‌లో వాహనాల రద్దీ



భారీ వాహనాలతో నిత్యం రద్దీగా కూర్మన్నపాలెం జంక్షన్

ఉక్కునగరం/కూర్మన్నపాలెం: రెండున్నర దశాబ్దాల కిందట నిర్మించిన జాతీయ రహదారి.. అనంతరం వేలాది వాహనాలు పెరిగినా అందుకు అనుగుణంగా విస్తరించకపోవడం.. ముఖ్యంగా పాత గాజువాక నుంచి అనకాపల్లి వరకు సర్వీస్ రోడ్లు లేకపోవడం.. తొందరగా గమ్యానికి చేరుకోవాలన్న ప్రయాణికుల ఆతృత.. వెరసి దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో హైవే నిత్యం నెత్తురోడుతోంది. గడిచిన రెండు నెలల్లోనే 12 మంది ప్రమాదాలకు గురై ప్రాణాలు విడిచారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ప్రధానంగా కూర్మన్నపాలెం కూడలి, వడ్లపూడి, టోల్‌గేటు, అగనంపూడి శనివాడ కూడళ్లలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దాదాపు అన్ని ప్రమాదాల్లో ద్విచక్ర వాహన చోదకులు లేదా వెనుక కూర్చున్న వారు ప్రాణాలు కోల్పోతున్నారు.

ప్రమాదాల తీరును పరిశీలిస్తే..

ఇటీవల రహదారులపై ప్రయాణించే వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. విశాఖ నగరంలో సుమారు 22 లక్షల వాహనాలు ఉన్నాయి. ప్రతీ రోజు సుమారు 23 వేల వాహనాలు అనకాపల్లి, లంకెలపాలెం, అగనంపూడి పరిసర ప్రాంతాల నుంచి టోల్‌గేటు నుంచి ప్రయాణిస్తున్నాయి. అయితే 1996 సంవత్సరంలో నిర్మించిన జాతీయ రహదారి ఆ తర్వాత పెరుగుతున్న వాహనాలకు తగ్గట్టు విస్తరించబడలేదు.

వాహనాలన్నీ ప్రధాన మార్గంలోనే..

నగరంలోని రహదారికి ఉన్న సర్వీసు రోడ్లు పాత గాజువాక నుంచి అనకాపల్లి వరకు లేవు. దీంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, ట్రక్కులు, బస్సులు, ట్రాలర్లు ప్రధాన రహదారిలోనే ప్రయాణించాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహన చోదకులకు పీక్ సమయం (ఉదయం 6 నుంచి 9 సాయంత్రం 4 నుంచి 6 గంటలు)లో ప్రయాణించడానికి తగిన స్పేస్ ఉండటం లేదు. ఈ క్రమంలో వాహన చోదకులు లేన్ డిసిప్‌లెన్స్ (ఎడమ వైపు) వెళ్లాలనే సంగతిని మరిచి భారీ వాహనాల మధ్య, వాటిని ఓవర్ టేక్ చేసి ప్రయాణిస్తున్నారు. గమ్యాన్ని చేరాలన్న ఆతృతతో భారీ వాహనాలకు అత్యంత సమీపంలో ప్రయాణించడం పరిపాటిగా మారింది. ఆ క్రమంలో భారీ వాహనాలకు ద్విచక్ర వాహన హ్యాండిల్ తగిలి వెనుక టైరు కింద పడి దుర్మరణం పాలవుతున్నారు.

ఇటీవల జరిగిన ప్రమాదాలు పరిశీలిస్తే ఎక్కువ ప్రమాదాలు వెనుక టైరు కింద పడినవిగా గుర్తించారు. అందులో కూడా తూలి పడటం వల్ల పిలియన్ రైడర్ (బైక్‌పై వెనుక కూర్చున్నవారు) సంఘటన స్థలంలో మరణించడం జరుగుతుంది. ఇటీవల జరిగిన ప్రమాదాలు గమనిస్తే దాదాపు అన్ని ప్రమాదాలు పగటి పూట (ఉదయం 6 నుంచి సాయంత్రం 6) మధ్య జరగడం గమనార్హం. వీటిలో భారీ వాహనాల నిర్లక్ష్యం కంటే ద్విచక్ర వాహన చోదకుల ఆతృత, త్వరగా వెళ్లిపోవాలనే కంగారు వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్టు తెలుస్తుంది. గాజువాక పారిశ్రామిక ప్రాంతంలోని ఫార్మాసిటీ, ఎస్‌ఈజెడ్, స్టీల్‌ప్లాంట్, ఆటోనగర్, హెచ్‌పీసీఎల్ వంటి పరిశ్రమలకు నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు జరుగుతుంటాయి. వాటిని నియంత్రించడం కష్టసాధ్యమని చెప్పక తప్పదు. ఈ నేపథ్యంలో వాహన చోదకులే మరింత జాగ్రత్తగా వాహనాలు నడపడం ద్వారానే ప్రమాదాల బారిన పడకుండా ప్రయాణించగలరు.

పరిష్కార మార్గాలు

- భారీ వాహనాలకు పక్కన కనీసం మీటరు దూరంలో ద్విచక్రవాహనం ప్రయాణించాలి.
- లేన్ డిసిప్లిన్, సెల్ఫ్ డిసిప్లిన్ పాటించాలి
- జాతీయ రహదారి విస్తరించాలి
- సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయాలి
- ఫ్లై ఓవర్లు నిర్మించాలి



కూర్మన్నపాలెం జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి (ఫైల్)

ఇటీవల జరిగిన ప్రమాదాలు

14-8-23 :	కూర్మన్నపాలెం కూడలి వద్ద ఆయిల్ ట్యాంకర్ హ్యాండిల్ తగలడంతో, ద్విచక్రవాహనం పై వ్యక్తి ఆయిల్ ట్యాంకర్ వెనుక చక్రాల కింద పడి మరణించారు.
12-8-23 :	టోల్ గేట్ జంక్షన్ వద్ద లారీ స్కూటీని ఢీకొనడంతో వ్యక్తి మృతి
5-8-23 :	శనివాడ జంక్షన్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుడు గొల్లవిల్లి అప్పారావు మృతి
21-7-23 :	ఆటోడ్రైవర్ నిర్లక్ష్యంతో చరణ్ తేజ్ అనే విద్యార్థి మృతి
12-7-23 :	కూర్మన్నపాలెం కూడలి వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో గణేష్(13) మృతి
23-6-23 :	కూర్మన్నపాలెం ఆర్టీసీ డిపో వద్ద లారీని ఢీకొట్టిన బొలెరో వాహనం: ఇద్దరు మృతి
19-6-23 :	శనివాడ జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో జి.లౌక్యసాయి ప్రసన్న (35) మృతి
10-6-23 :	ఈ మర్రిపాలెం వద్ద గురు తెలియని వాహనం ఢీకొని ఎల్. సోములమ్మ (65) మృతి
29-6-23 :	శనివాడ జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో కొల్లుమల్ల జయసాహితి (15) మృతి

భారీ వాహనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



వాహనాలకు తగినట్లు రహదారులు లేవు. ద్విచక్ర వాహన చోదకులు భారీ వాహనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. వేగంగా వెళ్లాలనే ఆదుర్దాతో వాహనాల మధ్య దూరి ప్రమాదాల బారిన పడుతున్నారు. లేన్ డిసిప్‌లెన్సై పాటిస్తూ, భారీ వాహనాలకు వీలైనంత దూరంగా వాహనాలను నడపడం ద్వారా ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలి.

– జి. ఉమామహేశ్వరరావు, ట్రాఫిక్ సీఐ

పురస్కార గ్రహీతకు సత్కారం



ఎస్‌ఐ పెద్దాడ రాజును సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

పెదగంట్యాడ: న్యూ పోర్టు ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ పెద్దాడ రాజును బాబు జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం సత్కరించారు. ఇటీవల జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న నేపథ్యంలో పెద్దాడ రాజును సత్కరించారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, గంట్యాడ గురుమూర్తి, గంట్యాడ గోవిందరాజు, టీకేటి పెంటయ్య, ములకలపల్లి వెంకటేష్, కాకినాడ పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి టోల్ గేట్ తొలగించాలి



విలేకరులతో మాట్లాడుతున్న 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు

మద్దిలపాలెం : నిబంధనలకు విరుద్ధంగా ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న అగనంపూడి టోల్ గేట్‌ను వెంటనే తొలగించాలని సీపీఎం నాయకుడు, 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు డిమాండ్ చేశారు. పిఠాపురంకాలనీలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో టోల్ గేట్ ఉండకూడదని ప్రభుత్వ నిబంధనలు చెప్తున్నా, బీజేపీ ప్రభుత్వ నాయకుల అండదండలతో అక్రమంగా టోల్‌గేట్‌ను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. దీన్ని తక్షణమే తొలగించాలన్న డిమాండ్‌తో ఈ నెల 21న టోల్ గేట్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు, ఉద్యోగులు, వాహన చోదకులు, క్యాబ్, లారీ ఓనర్ల అసోసియేషన్ సభ్యులు పాల్గొని, ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మద్దిలపాలెం జోన్ కార్యదర్శి క్రిష్టారావు తదితరులు పాల్గొన్నారు.

918వ రోజుకు 'ఉక్కు' దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికుల సమస్యలు పెడచెవిన పెడుతూ దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు అమ్మేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 918వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో ప్లాంట్‌లోని పలు విభాగాలకు చెందిన కార్మికులు కూర్చుని, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశ ప్రజలు తిరగబడే రోజు వస్తుందన్నారు. కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాలు దీనస్థితిలో ఉన్నాయని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రభుత్వరంగ సంస్థల జోలికి రాకుండా ఉంటేనే మంచిదని హితవు పలికారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

శ్రావణలక్ష్మికి కుంకుమార్చనలు



పూజలందుకుంటున్న మహాలక్ష్మి అమ్మవారు



త్రిశక్తి దేవాలయంలో మహాలక్ష్మి అమ్మవారు



షీలానగర్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

అక్కిరెడ్డిపాలెం: శ్రావణమాసం తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. షీలానగర్ ఎస్‌బీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో మహాలక్ష్మి అమ్మవారి నూతన బింబానికి అక్షి మోచనం, అభిషేకం, బింబ ఆవాహనం, విశేష హారతులు నిర్వహించారు. సాయంత్ర మహిళలచే సామూహిక లక్ష్మీ సహస్రనామ కుంకుమార్చన చేపట్టారు. ట్రస్ట్ ప్రతినిధులు పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

త్రిశక్తి ఆలయంలో..

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి దేవాలయంలో మహాలక్ష్మి అమ్మవారికి వేకువజామున గోత్ర నామార్చన చేశారు. శ్రీమహాదుర్గాదేవికి పంచామృతాభిషేకం చేశారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ ఆధ్వర్యంలో శ్రీమహాలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, సహస్ర తామర పుష్పార్చన చేశారు. అనంతరం అమ్మవారికి దీప, నక్షత్ర హారతులిచ్చారు. ఉక్కునగరం, పరిసర ప్రాంతాల భక్తులు హాజరయ్యారు.

సత్యసాయి భవనంలో..

పెదగంట్యాడ: శ్రావణ శుక్రవారం సందర్భంగా 76వ వార్డు వెంపళ్లనగర్‌లోని సత్యసాయి సేవా సమితి, వెంపళ్లనగర్ భజన మండలి ప్రతినిధి గళ్లా శంకర్‌సాయిరాం ఆధ్వర్యంలో సత్యసాయి భవనంలో ప్రత్యేక పూజలు చేశారు. వరలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య అమ్మవారిని దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా భజన మండలి ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.



76వ వార్డు వెంపళ్లనగర్‌లో కుంకుమార్చన చేస్తున్న మహిళలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

నేటి నుంచి ఉక్కుహౌస్‌లో ఫొటో ఎగ్జిబిషన్

ఉక్కునగరం: వాల్తేరు ఫొటోగ్రాఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఉక్కుహౌస్ బ్యాంకెట్ హాల్లో నిర్వహించనున్న ఎగ్జిబిషన్‌ను స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ ప్రారంభించనున్నారు. ఎగ్జిబిషన్‌లో 1940 సంవత్సరం నుంచి 2023 వరకు వాడుకలో ఉన్న వివిధ పురాతన కెమెరాలను ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా పలువురు ఫొటోగ్రాఫర్లకు ఆయన అవార్డులు ప్రదానం చేయనున్నారు.

'అధ్యయన యాత్రకు హాజరు కాలేను'

దాబాగార్డెన్స్ : వచ్చే నెల 3 నుంచి 10వ తేదీ వరకు అమృతసర్, శ్రీనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి, స్వచ్ఛభారత్ కార్యక్రమాలతో పాటు తాగు, మురుగునీటి వ్యవస్థల నిర్వహణపై అధ్యయనం చేసేందుకు కార్పొరేటర్ల స్టడీ టూర్‌లో తాను భాగస్వామిని కాలేనని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తెలిపారు. ఈ మేరకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని శుక్రవారం కలిసి లేఖ అందజేశారు.

విండ్‌బాల్ క్రికెట్ విజేత వెంపళ్లనగర్ జట్టు

గాజువాక : స్థానిక వుడా కాలనీలో ఆగస్టు 15 నుంచి 18వ వరకు నిర్వహించిన జిల్లాస్థాయి విండ్‌బాల్ క్రికెట్ పోటీల్లో వెంపళ్లనగర్ జట్టు మొదటి స్థానం సాధించింది. సీతానగరం జట్టు రెండో స్థానంలో, గొంతినవానిపాలెం జట్టు మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు చేతులమీదుగా ట్రోఫీ, రూ.20వేల నగదు బహుమతి, రెండో స్థానం పొందిన జట్టుకు రూ.12వేల నగదు బహుమతి, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.8వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీలను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 50 జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో స్థానిక క్రికెట్ క్రీడాకారులు ప్రతిభ ప్రదర్శించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు మజ్జి జగదీష్, సురేష్‌రెడ్డి, నీలాపు దినేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు..'



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరించడం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మీ వద్దకు పంపించారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రజలతో అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా తమ దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరిస్తున్నామని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 86వ వార్డు డాక్‌యార్డ్ కాలనీ సచివాలయ పరిధి రాజీవ్‌నగర్‌లో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావుతో కలసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఏమైనా సమస్యలున్నా, అర్హులై ఉండి పథకాలు ఎవరికైనా అందకపోయినా తెలియజేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మండల కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, వార్డు అధ్యక్షుడు వెలుగుల పరశురాముడు, చేగొండి శ్రీనివాసరావు, సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాస్ పట్నాయక్, బాలకృష్ణ, వార్డు మహిళా అధ్యక్షురాలు నిర్మల, కన్వీనర్లు రాజ్యలక్ష్మి, పత్తిపాటి శ్రీనివాసులు, నజీర్, కాశీం, గణేష్, వరలక్ష్మి, యోహాను, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు హాజరయ్యేవారూ శిక్షార్హులే!



బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం వెల్లడి

గాజువాక : బాల్య వివాహాలను ప్రోత్సహించడం, హాజరవడం కూడా చట్టరీత్యా నేరమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా గాజువాక జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాల చట్టం 2006పై పూర్తి అవగాహన లేకపోవడం వల్ల బాల్య వివాహాలను కొంతమంది ప్రోత్సహించడంతో పాటు హాజరవుతున్నారని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల నాయకులు కూడా ఇలాంటి వివాహాలకు హాజరవుతున్నట్లు తమ కమిషన్‌కు ఫిర్యాదులు అందాయని, ఇలాంటి సంఘటనలు విచారకరమని పేర్కొన్నారు. వరుడి తల్లిదండ్రులతో పాటు బాల్య వివాహాలకు హాజరయ్యే వ్యక్తులు, పురోహితులు, విందు భోజనం స్వీకరించినవారు వండి వడ్డించిన వారికి కూడా చట్టాన్ని అనుసరించి జైలు శిక్షలు, జరిమానాలు తప్పవని తెలియజేశారు. ప్రభుత్వం జీవో 13ను సవరిస్తూ ఇటీవల కొత్త జీవో 31ను తీసుకొచ్చిందన్నారు. ఈ ఉత్తర్వుల ద్వారా గ్రామస్థాయి అంగన్‌వాడీ కార్యకర్త నుంచి జిల్లా కలెక్టర్ వరకు అద్భుతమైన అధికారాలను ఇచ్చిందని అన్నారు. ఈ చట్టంపై ప్రజలను చైతన్యపరిచేందుకు తాము అన్ని ప్రభుత్వ శాఖలతో పాటు ఎన్జీవో సంస్థలను సమన్వయ పరుస్తున్నామని తెలిపారు. గాజువాక జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం మాట్లాడుతూ జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ సూచనలు, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు, ప్రభుత్వ శాఖల పర్యవేక్షణలో ఈ చట్టాన్ని సమర్థవంతంగా అమలు జరిగేలా చర్యలు ముమ్మరం చేస్తామన్నారు. కార్యక్రమంలో 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, పెదగంట్యాడ తహసీల్దార్ రమాదేవి, సీఐ వి.శ్రీనివాసరావు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన దివ్యాంగుల మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ (క్లరికల్) అధికారి సీహెచ్.సుబ్బిరెడ్డి తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహించినట్లు తెలియజేశారు. ఫైజర్ ఇండియా, ఏషియన్ పెయింట్స్, ఇండిగో ఎయిర్ లైన్, వింధ్యా ఇ- ఇన్ఫోమీడియా, సెంట్రల్ ఫార్మసీ, బీపీసీఎల్, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్, మాక్స్ ఫ్యాషన్, ఫ్లిప్‌కార్ట్, రిలయన్స్ ట్రెండ్స్, పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 457 ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూలకు 253మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. వారిలో 64మంది ఎంపికయ్యారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు సుబ్బిరెడ్డి నియామక పత్రాలు అందించారు.

మనసు, బుద్ధి ఆధీనంలో ఉంటే కార్యాలు సఫలం



అంబరీష్‌ను సత్కరిస్తున్న విజ్ఞాన్ ప్రతినిధులు

అగనంపూడి: ప్రతీ మనిషిలో రోజుకు 60వేల ఆలోచనలు ఉత్పన్నమవుతుంటాయని, వాటిలో 77 శాతం చెడు ఆలోచనలే ఉంటాయని అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రతినిధి అంబరీష దాస అన్నారు. మనసును, బుద్ధిని మన ఆధీనంలో ఉంచుకుంటే, మనం చేసే కార్యం సఫలీకృతమవుతుందన్నారు. జీవన నైపుణ్యాలపై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన బ్రిడ్జి కోర్సు ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మనసును ఆధీనంలో ఎలా ఉంచుకోవచ్చు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. చిన్న కారణాలకే విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారన్నారు. మానసిక ఆందోళనలను ఎలా అదుపు చేసుకోవాలో తెలిస్తే ఈ పరిస్థితులు ఉండవన్నారు. చెడు ఆలోచనలు దరి చేరకుండా ఉండేందుకు మన వేదాల్లో పరిష్కార మార్గాలు ఉన్నాయన్నారు. విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, డీన్ కె.మధుసూదనరావు, డాక్టర్ భాస్కరరావు, కో–ఆర్డినేటర్లు శృతి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.